క్లుప్తంగా

నేడు ముక్కంటికి ఊంజల్ సేవ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం ఊంజల్ సేవ నిర్వహించనున్నట్లు ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాత్రి 8 గంటలకు సేవ ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

మరమ్మతు పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని గాజులపెళ్లూరు చెరువు కట్ట మరమ్మతు పనులను మంగళవారం తహసీల్దారు సుబ్రమణ్యం, ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, ఎస్‌ఐ విశ్వనాథనాయుడు, ట్రాన్స్‌కో ఏఈ చలపతి పరిశీలించారు. వారు మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా చెరువు కట్ట దెబ్బతిన్నట్లు తెలిపారు. గండి పడకుండా మరమ్మతులు చేపట్టినట్లు వెల్లడించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు వివరించారు. రెవెన్యూ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ సైతం ఏర్పాటు చేశామని తెలిపారు.

బిందు సేద్యంతో నీటి ఆదా



మాట్లాడుతున్న ఏడీ సతీష్

బుచ్చినాయుడుకండ్రిగ : బిందు సేద్యంతో నీటిని ఆదా చేయవచ్చని డ్రిప్ ఇరిగేషన్ ఏడీ సతీష్ తెలిపారు. మంగళవారం వెస్ట్ వరత్తూరు, తలారివెట్టు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు డ్రిప్ ఇరిగేషన్‌పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ 90 శాతం రాయితీపై బిందు సేద్యం పరికరాలు అందిస్తున్నట్లు వెల్లడించారు. ఏఓ భారతి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. ఆరుతడి పంటలు సాగు చేస్తే నీటి అవసరం తక్కువగా ఉంటుందన్నారు. రైతులు తాము సాగు చేస్తున్న పంటలకు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



పారిశుద్ధ్య పనులు పర్యవేక్షిస్తున్న సర్పంచ్

ఏర్పేడు : పరిసరాల పరిశుభ్రతను తప్పనిసరి గా పాటించాలని సర్పంచ్ మోహనప్రియ కోరారు. మంగళవారం మండలంలోని ఎండీపుత్తూరులో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో నీరు నిల్వ చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లేకుంటే దోమలు వ్యాప్తి చెంది రోగాలు ప్రబలే ప్రమాదముందని హెచ్చరించారు. ఈ నెల 17వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రకళ పాల్గొన్నారు.


సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం: నారాయణవనంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శంకుస్థాపన చేశారు. రూ 8 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన రోడ్డు పనులను నెలలోపు పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సుమన్‌కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీఓ శేఖర్, ఏపీఓ సుకన్య, ఏపీఎం మమత పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే!



శ్రీకాళహస్తి: తొటంబేడు మండలం పెద్దకన్నలి పంచాయతీ బీసీ కాలనీలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. సీసీ రోడ్ల పనులను కాంట్రాక్టర్ అర్థాంతరంగా ఆపేయడంతో ఇబ్బందులు తలెత్తాయి. ఈ మార్గంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఉండటంతో నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రైతులు పొలం పనులు చేసుకునేందుకు ఈ దారిలోనే వెళుతుంటారు. అయితే అది మట్టి రోడ్డు కావడంతో చినుకు పడితే వాహనదారులు, పాదచారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. గ్రామానికి సమీపంలోని జాతీయ రహదారికి వెళ్లాలంటే ఈ మార్గమే శరణ్యం. దీంతో విద్యార్థులు, కూలి పనికి వెళ్లేవారు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే రోడ్డు వేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భయం భయం

ప్రజా సమస్యలు పరిష్కారానికి పనిచేసే ప్రభుత్వ కార్యాలయాలు దయనీయంగా మారిపోయాయి. భవనాలు శిథిలావస్థకు చేరడంతో ఉద్యోగులు భయం భయంగా విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితులు తలెత్తాయి. ఎప్పుడు ఎవరి నెత్తిన పెచ్చులు పడతాయో అంటూ సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఏ గది గోడ ఎప్పుడు కూలుతుందో అని బిక్కు బిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. నూతన భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు ఆపేశారు.

- అధ్వానంగా ప్రభుత్వ కార్యాలయాలు
- ఊగుతున్న గోడలు.. పెచ్చులూడుతున్న శ్లాబులు
- బిల్లులు చెల్లించకపోవడంతో అసంపూర్తిగా నూతన నిర్మాణాలు
- ప్రాణాలు పిడికిట్లో పెట్టుకుని విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు

శిథిలావస్థలో రెవెన్యూ కార్యాలయ భవనం,పెచ్చులూడుతున్న ఎంపీడీఓ కార్యాలయంలోని శ్లాబు



భవనాలు శిథిలం..





ఏర్పేడు : నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలతో కళకళలాడే తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయ భవనాలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. క్షణం క్షణం భయంభయంతో సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. సుమారు 50 ఏళ్ల క్రితం నిర్మించిన తహసీల్దారు కార్యాలయ భవనం పరిస్థితి మరింత దారుణంగా తయారైంది.ఇ ఎంపీడీఓ కార్యాలయ భవనంలో శ్లాబ్ పెచ్చులూడిపడుతోంది. దీంతో ఈ ఆఫీస్‌కు వచ్చేందుకు కూడా ప్రజలు భయపడుతున్నారు.గతంలో పలుమార్లు పెచ్చులూడి పడి సిబ్బంది, ప్రజలు గాయాలపాలైన ఘటనలు ఉన్నాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో భవనాలు ప్రమాదకరంగా ఉన్నాయి.

ఆగిన పనులు

2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం నూతన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులకు రూ.90 లక్షలు విడుదల చేసింది. శ్లాబ్ వరకు నిర్మించినా అప్పటి ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు పనులకు సంబంధించిన ఒక్క బిల్లు కూడా మంజూరు చేయలేదు. కాంట్రాక్టర్ బిల్లుల కోసం సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదు. అప్పులు చేసి భవన నిర్మాణాన్ని చేపట్టిన కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో అర్థాంతరంగా పనులు ఆగిపోయాయి. ఆరేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు బిల్లులు అందకపోవడంతో కాంట్రాక్టర్ అప్పులపాలయ్యాడు. ప్రస్తుతం తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ఈ రెండు భవనాలు ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఉన్నతాధికారులు స్పందించి నూతన భవనాల నిర్మాణానికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



అసంపూర్తిగా తహసీల్దారు కార్యాలయ భవనం

పకడ్బందీగా పన్ను వసూలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలో పకడ్బందీగా వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు ఆదేశించారు. మంగళవారం ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో ఆర్థిక వనరులు సమకూర్చుకుని అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. ప్రతి నెలా పంచాయతీ సమావేశం నిర్వహించాలన్నారు. ఆయా గ్రామాల్లోని దుకాణాల నుంచి లైసెన్స్ ఫీజు వసూలు చేస్తే ఆదాయం వస్తుందని చెప్పారు. అలాగే చేపల చెరువులు, ఫల దిగుబడులు ఇచ్చే చెట్లను బహిరంగ వేలం వేయాలని కోరారు. పన్ను వసూలు బాధ్యత గ్రామ కార్యదర్శులదే అని స్పష్టం చేశారు. సమావేశంలో ఈఓపీఆర్‌డీ రాజశేఖర్ పాల్గొన్నారు.

సత్యవేడు ఈఓపీఆర్డీగా తరునాక్షరెడ్డి



సత్యవేడు: ఈఓపీఆర్డీగా వి.తరునాక్షరెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన తొట్టంబేడు మండలం నుంచి బదిలీపై సత్యవేడుకు వచ్చారు. ఈఓపీఆర్డీ మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

నత్తనడకన పక్కా ఇళ్ల నిర్మాణం

- అటకెక్కిన పర్యవేక్షణ
- 5 మండలాలకు హౌసింగ్ ఏఈ ఒక్కరే!



సత్యవేడులో అసంపూర్తిగా పక్కా ఇళ్లు

సత్యవేడు : నియోజకవర్గంలో పక్కా ఇళ్ల నిర్మాణం నత్తనడకన సాగుతోంది. ఒకే హౌసింగ్ ఏఈకి ఐదు మండలాలను కేటాయించడంతో పర్యవేక్షణ కొరవడుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సత్యవేడులో 1,596, పిచ్చాటూరు-885, బీఎన్ కండ్రిగ-949 ఇళ్లు మంజూరు చేసింది. లబ్ధిదారులకు పూర్తి సహకారం అందించడంతో సత్యవేడులో 930, పిచ్చటూరు-218, బీఎన్ కండ్రిగలో 278 ఇళ్లు వివిధ దశలకు చేరాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదల ఇళ్ల నిర్మాణంపై శీతకన్ను వేసింది. దీనికితోడు పుత్తూరులో 2, సత్యవేడులో 3 మండలాలకు హౌసింగ్ ఏఈగా విధులు నిర్వర్తిస్తున్న వెంకటరత్నానికి పిచ్చాటూరు, సత్యవేడు, బీఎన్ కండ్రిగ మండలాల అదనపు బాధ్యతలు అప్పగించింది. దీంతో ఆయన ఒక్కరే 5 మండలాల్లో ఇళ్ల పనులను పర్యవేక్షించడం కష్టతరంగా మారింది. ఈ క్రమంలో సకాలంలో సహకారం అందక లబ్ధిదారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా రెగ్యులర్ ఏఈని నియమించి పక్కా ఇళ్లు పూర్తి చేయించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వైభవంగా కుంభాభిషేకం



స్వామివారి సేవలో నూకతోటి రాజేష్ తదితరులు

వరదయ్యపాళ్యం: మండలంలోని కువ్వాకులి పంచాయతీ లక్ష్మీపురంలో నూతనంగా నిర్మించిన శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం కుంభాభిషేకాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్, పార్టీ శ్రేణులతో కలిసి హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికి స్వామివారి దర్శన ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్న, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన్న తిలక్ బాబు, స్థానిక నేతలు మాధవయ్య, మహేంద్ర, సాయి రెడ్డి, శివయాదవ్, చంద్రయ్య, రమణయ్య, పాల్గొన్నారు.

ఆంక్షలు విధించడం అనుచితం

శ్రీకాళహస్తి : ముక్కంటి ఆలయంలో స్థానిక భక్తులకు దర్శనం కల్పించే విషయంలో ఆంక్షలు విధించడం అనుచితమని ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మండిపడ్డారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ విషయంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి స్పందించాలని డిమాండ్ చేశారు. గత పాలకమండలిలో స్థానిక భక్తులు, ఏ సమయంలో అయినా ఆలయంలోని కంచుగడప వద్ద నుంచి సులభ దర్శనం చేసుకునే అవకాశముండేదన్నారు. సాయంత్రం7గంటల తర్వాత అంతరాలయ దర్శనం కూడా కల్పించామని వెల్లడించారు. గత పాలకమండలి తీర్మాలను బుట్టదాఖలు చేసి పీఆర్‌ఓ క్యూలో నిలబడి టోకెన్లు తీసుకోవాలని నిబంధన విధించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశబుూరు. స్థానిక భక్తులు ఆధార్‌కార్డు చూపిస్తే ఏ సమయంలో అయిన లోపలకు పంపించేవిధంగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఆలయంతో సంబంధం లేని పలువురు నేతలు క్యూలో వెళ్లేవారిని చెక్ చేస్తున్నారని, టిండర్ల విషయంలో అడ్డుకుంటున్నారని ఆరోపించారు. మొదట వారిని నియంత్రించాలని కోరారు. ఆలయంలో ఐదుగురు ఈఓలు అనధికారికంగా పనిచేస్తున్నారని, దీనిపై ఎవరికి ఫిర్యాదు చేయాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి ఈఓ ప్రవేశపెట్టిన నిబంధనలను సడలించాలని సూచించారు. ఎలాంటి వివాదాలకు తావు లేకుండా స్థానిక భక్తులకు న్యాయం చేయాలని స్పష్టం చేశారు. పాలక మండలి మాజీ సభ్యుడు చిట్టివేలు జయగోపాల్ మాట్లాడుతూ చైర్మన్‌గా పోతుగుంట గురవయ్యానాయుడు ఉన్న సమయంలో అప్పటి ఈఓ భ్రమరాంబ స్థానిక భక్తుల ప్రస్తావన తీసుకువస్తే అడ్డుకున్నామన్నారు. ఇప్పుడు మళ్లీ అదే విధంగా శ్రీకాళహస్తి పట్టణంలోని స్వామివారి భక్తులను అవమానించేలా ప్రస్తుత ఈఓ నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు.

దళారీల నియంత్రణ కోసమే

స్థానిక భక్తుల విషయంలో తీసుకున్న నిర్ణయంపై ఆలయ ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ వివరణ ఇచ్చారు. స్థానిక భక్తుల కోసం భిక్షాల గాలిగోపురం వద్ద పీఆర్‌ఓ కార్యాలయం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఆధార్ చూపిస్తే దర్శనానికి స్లిప్ ఇస్తారని వెల్లడించారు. దళారీల నియంత్రణ కోసమే ఈ నిబంధన ప్రవేశపెట్టినట్లు వివరించారు.

ఘనంగా అబ్దుల్ కలామ్ జయంతి



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న మిద్దెల హరి

శ్రీకాళహస్తి రూరల్ : కాపుగున్నేరిలోని శ్రీకాళహస్తీశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్‌ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్స్ కళాశాలలో మంగళవారం ఘనంగా ఏపీజే అబ్దుల్ కలామ్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కరస్పాండెంట్ మిద్దెల హరి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. హరి మాట్లాడుతూ అబ్దుల్ కలామ్ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన జయంతిని ప్రపంచ విద్యార్థుల దినోత్సవంగా జరుపుకోవడం సంతోషంగా ఉందని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ గీతా దేవి, డైరెక్టర్ శ్రీ కుమార్ పాల్గొన్నారు.

మౌలిక వసతులకే ప్రాధాన్యం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ సుజాత

సత్యవేడు: మండలంలోని వీఆర్ కండ్రిగలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిచ్చినట్లు సర్పంచ్ ఎస్.సుజాత తెలిపారు. మంగళవారం పంచాయతీ పరిధిలోని రెండు వీధుల్లో ఉపాధిహామీ నిధులతో సిమెంటు రోడ్డు పనులకు భూమి పూజ చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ ఇబ్రహీం ఖాన్, సెక్రటరీ యుగంధర్, ఫీల్డ్ అసిస్టెంట్ రేఖ, స్థానిక నేతలు మోహన్, సుధాకర్ రాజు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు వినతి



అమర్చని నూతన ట్రాన్స్‌ఫార్మర్

ఏర్పేడు : గ్రామంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని మాధవమాల బీసీ కాలనీ వాసులు కోరారు. మంగళవారం వారు మాట్లాడుతూ కాలనీలోని ట్రాన్స్‌ఫార్మర్ అధిక లోడ్ కారణంగా తరచూ మరమ్మతులకు గురవుతోందన్నారు. ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళితే, రెండో ట్రాన్స్‌ఫార్మర్ పంపించారని, అయితే ఇప్పటి వరకు అమర్చలేదని వివరించారు. గ్రామానికి చెందిన ఓ టీడీపీ నేత కుట్రపూరితంగా వ్యవహరిస్తూ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయకుండా అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నాడని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని విన్నవించారు. దీనిపై ఎఈ వాసుదేవయ్యను వివరణ కోరగా, వర్షాలు తగ్గిన వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ అమర్చనున్నట్లు వెల్లడించారు.

అంత్యక్రియలకు అవస్థలు



కాలువను దాటి మృతదేహం తీసుకెళుతున్న గ్రామస్తులు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లె పంచాయతీ కస్తూరినాయుడు కండ్రిగలో శంకర్(52) అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన అంత్యక్రియలకు కుటుంబీకులు నానా అవస్థలు పడ్డారు. గ్రామ సమీపంలోని అరణియార్ నది కాలువను దాటి శ్మశానానికి వెళ్లాల్సి ఉంటుంది. భారీ వర్షం నేపథ్యంలో కాలువ నిండుగా ప్రవహిస్తోంది. ఈ క్రమంలో కాలువ దాటేందుకు గ్రామస్తులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఎలాగోలా కాలువను అధిగమించి శంకర్ అంత్యక్రియలు పూర్తి చేశారు.

అభ్యసన వైకల్యాలపై ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



ఏర్పేడులో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు



నారాయణవనంలో..

బుచ్చినాయుడుకండ్రిగ : అభ్యసన వైకల్యాలపై మంగళవారం ఉపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ నాడీ వ్యవస్థ దెబ్బతినడం ద్వారా అభ్యసన వైకల్యం వస్తుందన్నారు. ప్రత్యేక శిక్షణ ద్వారా వాటిని సరిచేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని ఉమామహేశ్వరీ, భవిత సెంటర్ ఉపాధ్యాయులు అయ్యప్పరెడ్డి, నయోమి పాల్గొన్నారు.

ఏర్పేడు : చదువులో వెనుకబడిన విద్యార్థుల అభ్యసన లోపాలను ప్రత్యేక శిక్షణ ద్వారా సరిదిద్దవచ్చని ప్రధానోపాధ్యాయని సునీత తెలిపారు. మంగళవారం ఏర్పేడు హైస్కూల్ విద్యార్థులు చేపట్టిన ర్యాలీలో ఆమె మాట్లాడారు. పిల్లల అభ్యసన సామర్థ్యాలు పెంపొందించడానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీరాములు, శివకుమార్, రమాదేవి, స్వర్ణలత పాల్గొన్నారు.

నారాయణవనం: ప్రత్యేక అవసరాల పిల్లల అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు కృషి చేయాలని ఎంఈఓ ప్రభాకర్‌రాజు కోరారు. మంగళవారం నారాయణవనం ప్రాథమిక పాఠశాలలో ప్రత్యేక అవసరాల పిల్లల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఎంఈఓ తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించి, విద్యార్థులకు నేర్చుకునే అవకాశం కల్పించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో భవిత రిసోర్స్‌పర్సన్లు విజయకుమార్, భరత్, హెచ్‌ఎం రోసి మండడి పాల్గొన్నారు.

ఈ- క్రాప్ నమోదు తప్పనిసరి





మాట్లాడుతున్న అగ్రికల్చర్ అసిస్టెంట్ భారత్, రేణిగుంట : రైతుల జాబితాను పరిశీలిస్తున్న సర్పంచ్ లక్ష్మీపతిరెడ్డి

బుచ్చినాయుడుకండ్రిగ : రైతులు తప్పనిసరిగా తాము సాగు చేస్తున్న పంటల వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని అగ్రికల్చర్ అసిస్టెంట్ భారత్ తెలిపారు. మంగళవారం గాజులపెళ్లూరు ఆర్‌బీకేలో ఈ-క్రాప్ నమోదుపై సామాజిక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆధార్, పాసు బుక్, బ్యాంకు పాసుబుక్ జెరాక్స్, ఫోన్ నంబర్ అందించి పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. దీంతో ప్రభుత్వం అందించే రాయితీలు అందుతాయని వెల్లడించారు.

రేణిగుంట : మండలంలోని విప్పమానుపట్టెడ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ రవిప్రసాద్ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, వివిధ పథకాలను వివరించారు. సర్పంచ్ లక్ష్మీపతిరెడ్డి మాట్లాడుతూ రైతులు తాము సాగు చేస్తున్న పంటలను ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు. ఇప్పటికే గ్రామంలో 46 మంది రైతులు నమోదు చేయించుకున్నట్లు వెల్లడించారు.

19 అడుగులకు చేరిన అరణియార్ నీటి మట్టం



19 అడుగులకు చేరిన అరణియార్ నీటి మట్టం

నాగలాపురం: పిచ్చాటూరు అరణియార్ నీటిమట్టం మంగళవారం సాయంత్రానికి 19 అడుగులకు చేరినట్లు ఇరిగేషన్ ఏఈ లోకేశ్వర్ రెడ్డి తెలిపారు. వర్షానికి ముందు ఈ ప్రాజెక్టులో 18 అడుగుల వరకు నీరు ఉండేదన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టుకు 160 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 31 అడుగులు (1.85 టీఎంసీలు)గా ఉంది.

పొంచి ఉన్న మృత్యువు



జయరామరావువీధిలో..

శ్రీకాళహస్తిలో పలుచోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి.. రక్షణ కంచె కూడా ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి.. రద్దీగా ఉండే ప్రాంతాల్లో సైతం కాలుడి పాశాలు కబళించేందుకు సిద్ధంగా పొంచి ఉన్నాయి.. అధికారుల దృష్టిలో ప్రాణాల విలువను తేటతెల్లం చేస్తున్నాయి.. భద్రత విషయంలో వారి నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికైనా ట్రాన్స్‌కో సిబ్బంది వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఫెన్సింగ్ వేయించాలని పట్టణ వాసులు కోరుతున్నారు. ప్రమాదం సంభవించకముందే తగు చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు. - శ్రీకాళహస్తి









మిల్క్ సొసైటీ పక్కన రక్షణ కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్, కూరగాలయ మార్కెట్.. చేపల మార్కెట్.. పూసల వీధిలో రక్షణ కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు